క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన టి.సిరసపల్లి–1 సచివాలయం, చూచుకొండ సచివాలయం, మునగపాక–1 సచివాలయం, 11న టి.సిరసపల్లి–2 సచివాలయం, గణపర్తి సచివాలయం, తిమ్మరాజుపేట సచివాలయం, 12న పాటిపల్లి సచివాలయం, మెలిపాక సచివాలయం, నాగులాపల్లి సచివాలయం, 13న రాజుపేట, చెర్లోపాలెం, ఒంపోలు సచివాలయ ప్రాంగణాల్లో ఈ క్యాంపులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మిత్రుని కుటుంబానికి ఆపన్న హస్తం



మిత్రుని భార్య, పిల్లలకు నగదు అందిస్తున్న 2001 బ్యాచ్ విద్యార్థులు

కోటవురట్ల: మానవత్వం పరిమళించింది. స్నేహ బంధం నేనున్నానంటూ ఆపన్న హస్తాన్ని అందించింది. తమకు స్నేహంలోని మాధుర్యాన్ని పంచి ఈ లోకాన్ని విడిచిన మిత్రుడిని పూర్వ విద్యార్థులు మరిచిపోలేదు. ఆ కుటుంబానికి మేమున్నామంటూ ఆత్మీయ హస్తాన్ని అందించారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో 2001లో పదో తరగతి చదివిన కాకర ఏసురత్నం అనారోగ్య కారణాలతో కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. నిరుపేద అయిన ఏసురత్నం కుటుంబాన్ని ఆదుకునేందుకు అతనితో కలిసి చదువుకున్న గొల్లు గణేష్, పైల కొండబాబు, రెడ్డి రాంబాబు, గంటల రామకృష్ణ, యర్రా రాజు, మిగతా సహచర మిత్రులు ముందుకొచ్చారు. అందరూ కలిసి రూ.52 వేలు నగదును మృతుడు ఏసురత్నం భార్యా పిల్లలకు సోమవారం అందజేశారు.

యోగాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, అధికారులు

పాయకరావుపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టి యోగాపై అవగాహన కల్పించినట్టు ఎంపీడీవో కె.జయప్రకాష్‌రావు తెలిపారు. ఈ ర్యాలీలో కూటమి నాయకులు తోట నగేష్, చించలపు ప్రదీప్, యాళ్ళ వరహాలు, మజ్జూరి నారాయణరావు, ఎంపీడీవో కార్యాలయం ఏవో వర్మ పాల్గొన్నారు.

వారపు సంతలో పనస ధరలు తగ్గుదల



మాడుగుల వారపు సంతలో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న పనస రైతులు

మాడుగుల : మాడుగుల పట్టణంలో సోమ వారం జరిగిన వారపు సంతలో పనసపండ్లకు ధరలు పలకలేదని, గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో పెద్దవి జత పనస పండ్లు రూ.100 పలికేవని, కానీ ప్రస్తుతం రూ.60 కూడా పలకలేదని ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది విశాఖ మన్యంలో అధికంగా పనస పండ్లు దిగుబడి పెరగడంతో ధరలు తగ్గిపోతున్నాయని, దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో ధరలు గిట్టుబాటు కాక ఎదురు చూస్తున్నామని గిరి రైతులు చెబుతున్నారు.

ఉపాధి బకాయిలను విడుదల చేయాలి

కె.కోటపాడు : మండలంలో ఇప్పటి వరకూ వేతనదారులకు చెల్లించాల్సి ఉన్న సుమారు రూ.12 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేసారు. గొండుపాలెం గ్రామంలో సోమవారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఉపాధి నిధులను తగ్గించి వేతనదారులకు పనులు లేకుండా చేస్తోందని ముత్యాలనాయుడు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు యర్రా దేముడు పాల్గొన్నారు.

టైప్-4 కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మాకవరపాలెం: ఉన్నత పాఠశాలలో ఉన్న టైప్-4 కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైప్-4 కేజీబీవీలో 9,10 తరగతులతోపాటు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం చదివే విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణరావును సంప్రదించాలన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మున్సిపల్ వాణిజ్య సముదాయం



నూకాలమ్మ ఆలయం ఎదురుగా దుకాణ సముదాయం

ఒకరి దుకాణం మరొకరికి..!

- నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు సబ్ లీజు
- లీజుకు ఇవ్వకుండా ఖాళీగా మరికొన్ని మున్సిపల్ దుకాణాలు
- షాపులపై సంవత్సరానికి వస్తున్న అద్దె రూ.36 లక్షలు
- పురపాలక ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోని అధికారులు

యలమంచిలి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పురపాలక సంఘానికి వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. యంత్రాంగం వీటి నిర్వహణ గాలికొదిలేయడంతో అక్రమార్కులు రాజ్యమేలుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒకరికి కేటాయించిన దుకాణాన్ని మరొకరికి రెట్టింపు ధరలకు సబ్ లీజుకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరైతే ఏకంగా తమ దుకాణాల ఎదుట ఉన్న మున్సిపల్, రోడ్లు, భవనాల శాఖ స్థలాలను సైతం అద్దెకు ఇచ్చి దర్జాగా అదనపు ఆదాయం పొందుతున్నారు.

యలమంచిలి రూరల్: వేలంలో దక్కించుకున్న దుకాణాలు పొందిన వారు నిబంధనల ప్రకారం సబ్ లీజుకు ఇవ్వకూడదని అధికారులు పలు షరతులు నిర్దేశించారు. అయినప్పటికీ ఏళ్లుగా ఈ దుకాణాలను కొందరు ధనవంతులే దక్కించుకుంటూ ఇతరులకు అద్దెకు ఇచ్చుకుంటూ పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇదంతా తెలిసినా మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి ఎప్పటికప్పుడు లీజుకిచ్చిన దుకాణాలు కేటాయించిన వ్యక్తులు నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? నిర్వహణ సక్రమంగా ఉందో? లేదో? దుకాణాలను సబ్ లీజుకు ఇచ్చుకుంటున్నారా? పరిశీలించాల్సి ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం ఆ పని చేయడం లేదు. బహిరంగ వేలం పాటలో చాలా కాలంగా అదే వ్యక్తులు దుకాణాలను దక్కించుకుంటూ, వాటిని అధిక మొత్తాలకు అద్దెకు ఇస్తూ లాభపడుతున్నారు.

ఖాళీగా 16 దుకాణాలు

పురపాలక సంఘం పరిధిలో ఆరు చోట్ల 93 దుకాణాలున్నాయి. వీటిలో ప్రస్తుతం 77 దుకాణాలు పాటదారులకు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు. దుకాణాలను అద్దెకివ్వడం ద్వారా పురపాలక సంఘానికి ఏడాదికి రూ.36 లక్షల ఆదాయం సమకూరుతోంది. అయితే నూకాలమ్మ ఆలయానికెదురుగా ఉన్న దుకాణ సముదాయంలో ఎన్నో ఏళ్లగా మొదటి అంతస్తులో 12 దుకాణాలు ఖాళీగా ఉండిపోయాయి. వీటిని అద్దెకు ఇవ్వడానికి బహిరంగ వేలం వేయడానికి అధికారులు పత్రికల్లో ప్రకటనలిస్తున్నా ఎవరూ ముందుకు రావడంలేదు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రతిసారీ ఇదే పరిస్థితి ఉంటోంది. వీటితో పాటుగా మరొక నాలుగు దుకాణాలకు కూడా వేలం పాట నిర్వహించాల్సి ఉంది. దుకాణాలు ఖాళీగా ఉండడంతో పాటు, కొమ్మాయిగుండం, కాలేజీ రోడ్డు, పీపీ కాంప్లెక్స్, సైతారుపేట రహదారి, ప్రధాన రహదారుల పక్కనున్న దుకాణాల్లో పాటదారులు కాకుండా సబ్ లీజుకు ఇచ్చుకున్నవి సగానికి పైగా ఉన్నాయి. వీటితో పాటు సన్యాసమ్మ చెరువు, కాలేజీ రోడ్డులో మరికొన్ని దుకాణాలను నిర్మిస్తే పురపాలక సంఘానికి లక్షలాది రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అయినప్పటికీ పాలకులు, యంత్రాంగం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఆదాయ వనరులు నిరుపయోగమవుతున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



మున్సిపల్ దుకాణ సముదాయాలను వేలం పాట ఖరారైన వ్యక్తులే ఉపయోగించుకోవాలి. వేరొకరికి సబ్ లీజుకు ఇవ్వకూడదు. దుకాణాలు కేటాయించినప్పుడే ఈ నిబంధనలు తెలియజేస్తున్నాం. అదే విధంగా పురపాలక సంఘానికి చెందిన దుకాణాల ముందున్న ప్రభుత్వ స్థలాలను అద్దెకివ్వకూడదు. ఖాళీగా ఉన్న దుకాణాలకు త్వరలో వేలంపాట నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. కొమ్మాయిగుండం చెరువు పక్కనున్న దుకాణ సముదాయంలో మొదటి అంతస్తులో ఉన్న షాపులు చాలా కాలంగా ఖాళీగా ఉండిపోవడం వాస్తవమే. ఈ దుకాణాలకు వేలం పాట నిర్వహణకు ప్రయత్నిస్తున్నా ఎవరూ తీసుకోవడానికి ముందుకు రావడం లేదు.

– టీజీఎస్ ప్రసాదరాజు, యలమంచిలి మున్సిపల్ కమిషనర్



కొమ్మాయిగుండం చెరువు పక్క సముదాయంలో లీజుకు ఇవ్వకుండా ఖాళీగా ఉన్న షాపులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: రైతులు వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సొంతం చేసుకోవచ్చని శాస్త్రవేత్త శ్రీహరిరావు తెలిపారు. మునగపాక, ఉమ్మలాడ గ్రామాల్లో సోమవారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, అనకాపల్లి వ్యవసాయ శాఖ సంయుక్త నిర్వహణలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు రాయితీపై ఎంపీపీ జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావుతో కలిసి ఆయన వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడితే అనర్థాలు తప్పవన్నారు. అధికారుల సలహాలు, సూచనలు మేర ఎరువులు వినియోగించాలన్నారు. ఎంపీపీ జయలక్ష్మి, శాస్త్రవేత్త గౌరీ, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు లక్ష్మీ ప్రవీణ, పద్మిని, ఏఈవో లక్ష్మి, టెక్కలి పరశురామ్, దాడి మునిలినాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ఆమె సోమవారం అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

పరిహారం ఇచ్చి తోటలు తొలగించండి

కారిడార్ పనులు అడ్డుకున్న సాగుదారులు



ఏపీఐఐసీ అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఆందోళనకారులు

నక్కపల్లి: పరిశ్రమల కోసం భూములు సేకరించే సందర్భంలో 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా తోటలను తొలగించి భూములు స్వాధీనం చేసుకుని పనులు ఎలా ప్రారంభిస్తారంటూ పలువురు సాగుదారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాజయ్యపేట సమీపంలో జరుగుతున్న కారిడార్ పనులను అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేస్తున్న బల్క్‌డ్రగ్ పార్క్ కోసం ఏపీఐఐసీ భూములు సేకరించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించే పనులు గత కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. భూసేకరణలో రాజయ్యపేట, బోయపాడు పరిసర ప్రాంతాల్లో పేదలు సాగు చేసుకుంటున్న డీఫారం, ప్రభుత్వ భూములు ఉన్నాయి. 2013 భూసేకరణ చట్ట ప్రకారం కంపెనీల కోసం ఈ భూములు స్వాధీనం చేసుకున్న సమయంలో వాటిలో ఉన్న ఫలసాయానికి, భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. గత రెండు రోజులుగా ఏపీఐఐసీ అధికారులు డీ ఫారం, సాగుదారులకు చెందిన భూముల్లో మామిడి, జీడి తోటలను తొలగిస్తున్నారు. వీటికి ఇంత వరకు పైసా కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. పరిహారం ఇవ్వకుండా తోటలు తొలగించడంపై సాగుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తోటల తొలగింపు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అధికారులు పోలీసుల సాయంతో వారిని బెదిరించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు ఎం. అప్పలరాజు, స్థానిక టీడీపీ నాయకుడు పిక్కి శ్రీను, తదితరులు వెళ్లి సాగుదారులతో కలసి పనులను అడ్డుకున్నారు. ఈ దశలో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగింది. సాగుదారులు మాట్లాడుతూ చాలా ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో జీడి, మామిడి తోటలు పెంచి సాగు చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు, 2013 భూసేకరణ చట్ట ప్రకారం ప్రభుత్వ భూముల్లో ఫలసాయానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. పైసా పరిహారం చెల్లించకుండా తోటలు తొలగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అధికారులు మాత్రం తాము స్వాధీనం చేసుకుంటున్న భూములకు మాత్రమే పరిహారం చెల్లించాలని, ఫలసాయానికి పరిహారం చెల్లించాలని ఎక్కడా నిబంధనలు లేవన్నారు. ఈ విషయాన్ని మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రభాకరరావు

ఎస్.రాయవరం: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ప్రభాకరరావు అన్నారు. ఉప్పరాపల్లి, సర్వసిద్ధి, సైతారుపేట, వెంకటాపురం గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలకు తగ్గట్టు నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకుని పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ కొబ్బరి, అరటి, కూరగాయ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయాలన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మన ప్రాంతానికి అనువైన నూతన రకాలు, వాటి లక్షణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య, ఉప్పరాపల్లి, సర్వసిద్ధి, వెంకటాపురం, సైతారుపేట సర్పంచ్‌లు శానాపతి శ్రీరాములు, గణేశ్వరరావు, కొప్పిశెట్టి సత్యం, రావి రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



చౌడువాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సరోజిని

కోటవురట్ల: విత్తన శుద్ధితో వరిలో అధిక దిగుబడులు సాధ్యపడతాయని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని కోటవురట్ల, చౌడువాడ గ్రామాలలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శాస్త్రవేత ప్రసాదరావు మాట్లాడుతూ వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబించాలన్నారు. విత్తన శుద్ధి చేయడం వల్ల నారుమడులు తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. వ్యవసాయాధికారిణి బి.సరోజిని మాట్లాడుతూ వరి సాగులో వెద పద్ధతితో ఖర్చు తగ్గడమే కాకుండా మంచి దిగుబడులు సాధ్యపడతాయన్నారు. నూతన రకాలైన ఎంటీయూ 1224, ఎంటీయూ 1262, ఎంటీయూ 1318 వంగడాలతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. యాంత్రీకరణ తో కూలీల అవసరం లేకండా తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పలు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ గౌడ్, ఎంపీటీసీ పుట్రేవు వెంకటసూర్యారావు, సర్పంచ్ గోపాలకృష్ణ, వ్యవసాయ సహాయకులు ఈశ్వరి, జ్యోతి, కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆ నష్ట పరిహారం ఎస్సీ కాలనీకి చెందాలి



కాగిత వద్ద రోడ్డు పనులు అడ్డుకుని ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

నక్కపల్లి: మండలంలో కాగిత నుంచి రాజయ్యపేట వరకు బల్క్ డ్రగ్‌పార్క్ కోసం తలపెట్టిన రోడ్డు నిర్మాణంలో ఎస్సీ కాలనీకి చెందిన బావిని కప్పేశారని, దీనికి సంబంధించిన పరిహారం ఎస్సీ కాలనీకే చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కాగిత నుంచి బల్క్‌డ్రగ్ పార్క్ వరకు ఏపీఐఐసీ 80 అడుగుల రోడ్డు నిర్మిస్తుంది. ఈ రోడ్డులో ఎస్సీ కాలనీకి సమీపంలో మంచినీటి బావి ఉంది. దీన్ని కప్పేసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. మూడు సెంట్ల స్థలాన్ని చాలా సంవత్సరాల క్రితం ఎస్సీ కాలనీకి సమకూర్చడంతో కాలనీ వాసుల అవసరాల కోసం మంచినీటి బావిని నిర్మించి తాగునీటి కోసం ఉపయోగిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకుడు అనపర్తి పాండు, తదితరులు తెలిపారు. అయితే ఇటీవల రోడ్డు నిర్మాణంలో భాగంగా సేకరించిన భూములు, బావులకు ప్రభుత్వం వారు నష్టపరిహారం చెల్లించారని, ఎస్సీ కాలనీలో ఉన్న బావికి నష్టపరిహారాన్ని గతంలో భూమిని దానంగా ఇచ్చిన రైతులకు చెల్లించారని వారు ఆరోపించారు. కాలనీకి చెందిన దళితులంతా పనులు అడ్డుకుని ధర్నా నిర్వహించారు. సుమారు 50 ఏళ్ల క్రితమే కాలనీకి ఉచితంగా ఇచ్చిన భూమికి ఇప్పుడు నష్టపరిహారం తీసుకోవడం దారుణమన్నారు. నష్ట పరిహారం కాలనీకి దక్కేలా చర్యలు తీసుకుంటే ఈ నిధులతో ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లు చేసుకుంటామని, ఏపీఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి



అనకాపల్లి ఎంపీ రమేష్‌కు వినతి అందజేస్తున్న పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు పలువురు బాధితులు వినతి అందజేశారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బాధితులకు ఇచ్చే పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేసేలా చూడాలని బాధితులు కోరారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అభివృద్ధికి తామంతా సమ్మతమని, అయితే పరిహారం విషయంలో తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన రహదారి విస్తరణ బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వినతి అందజేసిన వారిలో బొడ్డేడ రామచంద్రరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, అనంత్, కృష్ణ తదితరులు ఉన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

నర్సీపట్నం : అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా సమితి నాయకులు తహసీల్దార్ కార్యాలయం డిటి నరేంద్రకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు గంగాభవానీ, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు గురుబాబు మాట్లాడుతూ భూమిలేని నిరుపేద కౌలు రైతులకు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలన్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ సమావేశంతో ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

అచ్యుతాపురం రూరల్ : మండల కేంద్రమైన అచ్యుతాపురంలోని ఓ ప్రైవేట్ లాడ్జీలో సోమవారం నిర్వహించిన టీడీపీ సమావేశం కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహన చోదకులు గంట పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఓ రోగిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న అంబులెన్స్ సైతం అర గంట పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. అసలే ఫ్లైఓవర్ నిర్మాణంతో దారులన్నీ ఎక్కడికక్కడ మూతపడ్డాయి. ఉన్న అరకొర మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులకు ఇలా ప్రధాన రోడ్డులో పార్టీ సమావేశాలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. నాయకులు ప్రజల సమస్యలు పరిష్కరించకపోయినా పర్వాలేదు కానీ.. కొత్త సమస్యలు సృష్టించకపోతే చాలు అని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

పచ్చని తివాచీలా.. తూటికాడ

మునగపాక మండలంలోని పలు సాగునీటి కాలువల అధ్వాన దుస్థితికి ఈ చిత్రమే నిదర్శనం. తూటికాడ పేరుకుపోవడంతో కాలువలు తమ స్వరూపాన్ని కోల్పోతున్నాయి. సాగునీటి కాలువలపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కాలువల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉన్నా పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూలపేట వద్ద కాలువ తూటికాడతో పచ్చని తివాచీలా దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి తూటికాడ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– మునగపాక



మూలపేటలో తివాచీలా దర్శనమిస్తున్న సాగునీటి కాలువ

ఎన్‌సీసీ యువశక్తి క్యాంప్‌లో వన మహోత్సవం



వర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్

సబ్బవరం: భవిష్యత్ తరాల మనుగడ కోసం ప్రకృతి వనరులను మనమే కాపాడుకోవాలని ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభాత్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా విశ్వవిద్యాలయం ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. స్వర్ణిమ్ ప్రభాత్ ఆధ్వర్యంలో గ్రీన్‌క్లైమేట్ ఎన్‌జీవో సహకారంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్ తన ప్రతి పుట్టిన రోజున ఓ మొక్కను నాటి, పెంచాలన్నారు. వర్సిటీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి 468 మంది క్యాడెట్స్ కోసం 468 మొక్కలను అందించిన గ్రీన్‌క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నంను అభినందించారు. రత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవితాన్ని అలవరచుకోవాలన్నారు. ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుబేదార్ సుజన్ సింగ్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.